కంటోన్మెంట్‌లో 2 ఓట్లు!

తొలి ఓటు ఎంపీ, తర్వాతే అసెంబ్లీకి..

- 20 'ట్రిపుల్ ఆర్' కేంద్రాలు
- మహిళా ఓటర్లే ఆధిక్యం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికలతో పాటే ఉప ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గం పరిధిలో 232 పోలింగ్ కేంద్రాల్లో 2,53,706 మంది ఓటర్లుండగా పురుషులు 1,26,699, మహిళలు 1,26,997, ఇతరులు 10 మంది ఉన్నారు. ఆరు నెలల క్రితం జరిగిన సాధారణ ఎన్నికలతో పోలిస్తే నియోజకవర్గంలో 3,038 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో పురుషులు 780 మంది కాగా, మహిళలు 2,283 మంది ఉండటం గమనార్హం. నియోజకవర్గంలో పురుషుల కన్నా మహిళా ఓటర్లు 298 అధికంగా ఉన్నారు. 232 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్ తెలిపారు. 5 పోలింగ్ కేంద్రాలను మోడల్ కేంద్రాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐదు పోలింగ్ కేంద్రాల్లో పూర్తి మహిళా సిబ్బంది మాత్రమే ఉంటారన్నారు. దివ్యాంగులు, యువత ఆధ్వర్యంలో ఒక్కో పోలింగ్ కేంద్రం చొప్పున నిర్వహణ సాగుతుందన్నారు.

ఎంపీకి తొలిఓటు..

సార్వత్రిక ఎన్నికలతో పాటే అసెంబ్లీ ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కంటోన్మెంట్‌లో ఓటర్లు రెండేసి చొప్పున ఓట్లు వేయాల్సి ఉంటుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఎంపీ, ఎమ్మెల్యే కేంద్రాలకు వేర్వేరు బాక్స్‌లను ఏర్పాటు చేశారు. అయితే పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన ఓటరు తొలుత మల్కాజ్‌గిరి పార్లమెంట్ బరిలో నిలిచిన ఓటర్ల ఎంపిక కోసం ఓటు వేస్తారు. అనంతరం కంటోన్మెంట్ అసెంబ్లీకి ఓటేస్తారు. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున శ్రీగణేశ్, బీఆర్ఎస్ నుంచి నివేదిత, బీజేపీ అభ్యర్థిగా వంశ తిలక్, బహుజన్ ముక్తి పార్టీ నుంచి యు. రాజేందర్, ధర్మ సమాజ్ పార్టీ తరఫున జి. నర్సింగ్ రావు, తెలంగాణ రిపబ్లికన్ పార్టీ నుంచి యాదీశ్వర్ నక్క, ఇండిపెండెంట్‌లుగా జీడిమడ్ల రాజ్‌కుమార్, ఎం. జైరామ్, ఈ. శంకర్, దండే రత్నం, బండారు నాగరాజు, సంజీవులు, దూడ మహిపాల్, డి. కృష్ణవేణి, ఎం. రాజహంస రాజేశ్ బరిలో నిలిచారు.


వెస్లీ కాలేజీ ఆవరణలోని డీఆర్‌ఎసీలో ఎన్నికల సామగ్రి తీసుకుంటున్న సిబ్బంది

20 'ట్రిపుల్ ఆర్' కేంద్రాలు



132 ప్రాంతాల్లో 232 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, వీటిలో 20 కేంద్రాలను 'ట్రిపుల్ ఆర్' పోలింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. అంటే ఆయా కేంద్రాలను పర్యావరణ హితంగా రూపొందించారు. 'రెడ్యూజ్, రీ యూజ్, రీ సైకిల్' విధానంలో వ్యర్థాల పునర్వినియోగం ద్వారా తయారు చేసిన వస్తువులను ఉపయోగించారు. అంటే కారు టైర్లు, ప్లాస్టిక్ బాటిళ్లను పూలకుండీలు, ఇతరత్రా వస్తువులుగా మార్చారు. ఈ వస్తువులను పోలింగ్ కేంద్రాల్లోని 70 పోలింగ్ స్టేషన్‌లో వినియోగిస్తున్నారు. తద్వారా ఓటర్లకు ప్లాస్టిక్ నిషేధం, పునర్వినియోగంపై, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

అమ్మ ప్రేమ అమృతం లాంటిది


కేక్ కట్ చేస్తున్న మహిళలు


మహిళలకు పౌష్టికాహార పదార్థాలు అందజేస్తున్న దృశ్యం


మదర్స్ డే వేడుకల్లో జెక్‌కాలనీ మహిళలు

సనత్‌నగర్: జెక్‌కాలనీ ఉమెన్స్ కిట్టీ పార్టీ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మలోని మాధుర్యాన్ని పంచుకున్నారు. సృష్టికి మూలం అమ్మ అని, ప్రపంచంలో కల్తీ లేని ప్రేమ ఒక్క అమ్మదేనంటూ తల్లి గొప్పతనం గురించి వివరించారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మదర్స్ డే సందర్భంగా కాలనీకి చెందిన ప్రభఅనంతరెడ్డి, విజయలక్ష్మీ, హైమావతి, హరితలను సత్కరించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ మాట్లాడుతూ.. తల్లిని మించిన దైవం మరొకటి లేదని ప్రతిఒక్కరికి ఆది గురువు అమ్మేనన్నారు. మాతృ దినోత్సవం రోజునే కాకుండా సంవత్సరం పొడవునా అమ్మదనపు కమ్మదనాన్ని ఆస్వాదిస్తూ గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కృష్ణకుమారి, విజయ, పూర్మానీ భాగ్యలత, స్వప్న, జ్యోతి, సృజన, వర్ధిని, వాణి, సంధ్య, అమరావతి, శారద, శ్రీదేవి, శోభ పాల్గొన్నారు.

అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో..

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ మాతృత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాయల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సంరక్షణ, ప్రసూతి సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు ఆర్.సి.కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాలే మహిళలకు సురక్షితమన్నారు. నర్సులు, వైద్యులు సిబద్ధతతో సేవలందించడాన్ని కొనియాడారు. అమీర్‌పేట ఆసుపత్రిలో గల ఆధునిక వసతులు,సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.మాతృత్వ దినోత్సవ రోజునే నర్సుల దినోత్సవం కూడా జరుపుకోవడం సంతోషదాయకమని అన్నారు.నర్సులు,వైద్య సిబ్బందిని శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైద్యురాలు చంద్రకళ, సంస్థ కార్యదర్శి ఆర్.విజయశ్రీ, నాగరేఖ, ఛాయాదేవి, ప్రభ, జీవీఎస్‌రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

శాంతినగర్‌లో..

లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లోని బెత్లహేమ్ ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం తల్లులందరిని శాలువాతో సన్మానించి బహుమతులు అందజేశారు. సృష్టికి మూలం అమ్మ అని అమ్మ ప్రేమను వర్ణించలేమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఆచార్య అహరోన్ తీగుళ్ల, ఎలిషమ్మ, మహిళలు పాల్గొన్నారు.



మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి ఆదివారం తన నివాసం నుంచి అజ్మీర్‌లోని దర్గాకు చాదర్‌ను పంపించారు. నేడు జరగబోయే ఎన్నికల్లో తాను ఎంపీగా గెలువాలని కోరుకుని చాదర్ సమర్పించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సెక్రటరీ అయూబ్‌ఖాన్, సీనియర్ నేత సంజీవరెడ్డి, రాజేష్‌యాద్ పాల్గొన్నారు. –సాక్షి, సిటీబ్యూరో

దేవాలయాల్లో కిషన్‌రెడ్డి పూజలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఆదివారం సికింద్రాబాద్ గణపతి, ఉజ్జయినీ మహంకాళి దేవాలయాలను ఆయన దర్శించుకుని పూజలు చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న నల్లగుట్టకు చెందిన సీనియర్ నాయకులు పులి మదన్ ఇంటికి వెళ్లి కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట చీర శ్రీకాంత్, అవినాష్ వర్మ, శ్రీనివాస్‌కుమార్ యాదవ్ ఉన్నారు.

ముగిసిన శంకర జయంతి వేడుకలు

వెంకటేశ్వరకాలనీ: శ్రీ నగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు ఆదివారం ముగిశాయి. ఆదివారం ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా శ్రీ విజయ శంకర దేశిక వేద పాఠశాల విద్యార్థులు, వేద పండితులు పాల్గొని వేద సభ నిర్వహించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న శ్రీలతా శోభన్‌రెడ్డి

లాలాపేట: ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన ఓటు ద్వారా తమకు నచ్చిన ప్రభుత్వాలను ఎన్నుకునే అవకాశం ఉందని.. కాబట్టి పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ బూత్‌లకు తరలిరావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనేలా యువత ప్రత్యేక చొరవ తీసుకుని అందరూ ఓటేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

లాలాపేట: దృష్టి మరల్చి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్న ఓ ముఠాను అరెస్టు చేసిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన ముఖేష్ (35) మేస్త్రీ. ఈ నెల 6న నాగోల్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి తన సామగ్రితో ఆటో కోసం వేచి ఉన్నాడు. అదే సమయంలో బార్కాస్‌కు చెందిన యాసిన్ అలీ ఖాద్రీ(21) సెంట్రింగ్ వర్కర్, పహాడిషరీఫ్‌కు చెందిన షేక్ ఉమ్రాన్, లారీ మెకానిక్, యాకుత్‌పురాకు చెందిన సయ్యద్ ఆదిల్(24) కార్ వాషింగ్ కార్మికుడు, సజ్జు నలుగురు ఆటోలో వచ్చి అతన్ని ఆటో ఎక్కించుకున్నారు. మార్గమధ్యలో మాటలతో అతన్ని దృష్టి మరల్చి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. తార్నాకలో గుడ్‌లాండ్ బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు రాగానే ఆటోలో స్థలం సరిపోవడం లేదంటూ దించేశారు. దీంతో బాధితుడు మరో ఆటోలో సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. అక్కడికి వెళ్లి చూసుకునేసరికి తన సెల్‌ఫోన్ కనిపించలేదు. మొదటి ఆటోలోని తోటి ప్యాసింజర్లుగా నటించిన వారే తన ఫోన్ చోరీ చేశారని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముగ్గురిని అరెస్టు చేయగా ఒకరు పరారీలో ఉన్నారు. వీరిపై గతంలో పలు స్టేషన్లలో కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటేద్దాం రండి!

- నేడే పోలింగ్
- లష్కర్‌లో 220 బూత్‌లు, 2,65,982 ఓటర్లు


ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

సికింద్రాబాద్: లోక్‌సభ ఎన్నికల కోసం ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలోని 220 పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేయనున్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్ నేతృత్వంలో సహాయ ఎన్నికల అధికారులు ఎల్లారెడ్డి, సుభాష్‌రావు ఎన్నికల తీరును సమీక్షిస్తున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, పోలింగ్ సిబ్బందితో సుమారు 1500 మందిని వినియోగించుకోనున్నారు.

మొత్తం ఓటర్లు:	2,65,982
పురుషులు:	132781
మహిళలు:	133174
ఇతరులు:	27

ఈవీఎంలపై శిక్షణ..

ఎన్నికల నిర్వహణ కోసం ఎంపిక చేసిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఆదివారంతో శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. రెండు రోజులుగా వీరందరికీ ఓయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈనెల 13న ఉదయం వీరు ఎలక్ట్రానిక్ మెషిన్‌లు స్వాధీనం చేసుకోవడం, పోలింగ్ పూర్తయ్యాక సీజ్ చేసి తిరిగి అప్పగించడం వరకు ఈవీఎంల పట్ల అధికారులకు శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పించారు.

అంతా ఓయూ నుంచే..

సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఎన్నికల వ్యవహారాలన్నీ నామినేషన్ల పర్వం ముగిసిన మీదట ఓయూ నుంచి కొనసాగనున్నాయి. ఓయూ పరిధిలోని ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ భవనం నుంచి ఎన్నికల వ్యవహారాలు కొనసాగిస్తున్నారు. ఈవీఎంలను ఇదే భవనంలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరుస్తున్నారు. ఇక్కడి నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలింపు నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు డిస్టెన్స్ కేంద్రం నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తామని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

సనత్‌నగర్‌లో..

మొత్తం ఓటర్లు	2,53,381
పురుషులు	1,31,074
మహిళలు	1,22,295
ఇతరులు	12

సనత్‌నగర్: నేడు జరిగే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా సనత్‌నగర్ అసెంబ్లీకి సంబంధించి పోలింగ్ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. నియోజకవర్గంలో 97 భవనాల్లో (లొకేషన్స్) 229 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ బూత్‌ల ద్వారా 2,53,381 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వరండాలు లేని పోలింగ్ బూత్‌ల ముందు షామియానా ఏర్పాటు చేయడం, మంచినీటి వసతి, టాయిలెట్లు, మరుగుదొడ్లు వంటి వసతులపై పోలింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఇంటింటికి స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తి చేశారు.


ఈవీఎంలు, వీవీప్యాట్లను పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది

విధుల్లో 2,500 సిబ్బంది..

సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధి కిందికి వచ్చే ఒక్క సనత్‌నగర్ నియోజకవర్గంలోనే దాదాపు 2,500 మంది సిబ్బంది ఎన్నికల విధులకు పురమాయించారు. నియోజకవర్గాన్ని 23 రెవెన్యూ రూట్లుగా విభజించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంలను ఎన్నికల సిబ్బందికి ఆదివారం పంపిణీ చేశారు.

ఎప్పటికప్పుడు ఈసీకి సమాచారం..

పోలింగ్ జరుగుతున్న తీరు, క్యూలో ఎంతమంది నిలబడ్డారు..గంట గంటకూ పోలింగ్ శాతం..వంటి వివరాలను ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్‌కు నివేదించేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం సెక్టోరియల్ అధికారులతో పాటు సహాయక సెక్టోరియల్ అధికారులను నియమించారు. వీరు 10-15 పోలింగ్‌బూత్‌ల్లో జరుగుతున్న పోలింగ్ సరళిపై నిఘా ఉంచి అప్‌డేట్స్ అందిస్తుంటారు.

39 సమస్యాత్మక కేంద్రాలు

సనత్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 39 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. సమస్యాత్మక బూత్‌లు ఉన్న భవనాల వద్ద సబ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది ద్వారా నిఘా కొనసాగనుంది. వీరితో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది, ప్రత్యేక భద్రతా సిబ్బంది భద్రతను పర్యవేక్షిస్తారు. ఎన్నికల నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

